క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సోమశిల: ఇందూ జ్ఞాన వేదిక త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో అనంతసాగరం మండలం వడ్డిపాళెం, పాతదేవరాయపల్లి, ముత్తుకూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జీ పెంచల నరసయ్య, సభ్యులు ఎం కొండయ్య, పీ మధు, పీ కిషోర్, పీ జాహ్నవి, ఈ పద్మాశేషాద్రి, సుధాకరాచారి, పెంచలయ్య, మాళవిక, గాయత్రి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కావలి : కావలి రైల్వే స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద ఆదివారం పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడు. బులుగు, తెలుపు రంగు గీతలు కలిగిన ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగు, పింక్ గీతలు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని కావలి రైల్వే పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కావలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు




ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీవాసులు గ్రామదేవత పోలేరమ్మతల్లికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత మహిళలు పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకుని ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

క్రికెట్, వాలీబాల్ పోటీల విజేత ఉదయగిరి



ఉదయగిరి: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ఉదయగిరి జట్లు ప్రథమస్థానంలో నిలిచాయి. క్రీడల్లో సత్తాచాటిన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ మండల శాఖ అభినందనలు తెలిపింది.

గణేశ్ నిమజ్జనోత్సవం



సోమశిల: వినాయక చవితి వేడుకల్లో భాగంగా అనంతసాగరం మండలం రేవూరులో శ్రీతేజ సాయి సేవా ట్రస్టు ఎండీ, ప్రవాస భారతీయుడు బోయిళ్ల జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. అనంతరం గణనాథుడ్ని నిమజ్జనానికి తరలించారు.

ప్రమాదభరితంగా నేలబావులు

ఉదయగిరి: మండలంలోని గుడినరవలో నేలబావులు ప్రమాదభరితంగా ఉన్నాయి. గతంలో మంచినీటి కోసం నేలబావులను వినియోగించే వారు. ప్రస్తుతం వాటిలో నీరులేక వినియోగించకపోవడంతో పాడుబడ్డాయి. వాటిని పూడ్చకుండా అలాగే వదిలేయడంతో పిల్లలు ఆడుకుంటూ వెళ్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. పశువులు సైతం పడిపోయి చనిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడుబడిన నేలబావులను పూడ్చాలని పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శివ శివా..దారి చూపవా!

▸▸ ఘటిక సిద్దేశ్వరానికి రాళ్లు తేలిన రోడ్డే దిక్కు

పురాతన శైవక్షేత్రం ఘటిక సిద్దేశ్వరం. దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలో ఉన్న క్షేత్రానికి మూడు కిలో మీటర్ల దూరం సరైన రోడ్డు సౌకర్యం లేదు. అటవీశాఖ పరిధిలో ఉందనే కారణంతో ఆ శాఖ అధికారులు తారురోడ్డు నిర్మాణానికి అంగీకరించడం లేదు. వర్షం పడితే మట్టి రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించి తారు రోడ్డు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవచూపాలని భక్తులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న సిద్దేశ్వరం క్షేత్రానికి వెళ్లే దారి

సీతారామపురం : మండలంలోని దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలో ఉన్న పురాతన శైవక్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరానికి వెళ్లేందుకు భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ఈ శైవక్షేత్రంలో పరమశివుడు, అమ్మవారు నక్క వాహనంపై కొలువుతీరి ఉంటారు. దీంతో కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢ నమ్మకంతో ఏడాది పొడవునా జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన భక్తులు, వీఐపీలు పెద్ద ఎత్తున వచ్చి క్షేత్రాన్ని దర్శించుకుంటుంటారు. కార్తీక మాసం, మహాశివరాత్రి పండగ సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ క్షేత్రానికి వెళ్లేందుకు సుమారు మూడు కిలోమీటర్ల మేర సరైన రోడ్డు సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయగిరి–సీతారామపురం జాతీయ రహదారి మార్గంలోని పోకలవారిపల్లి గ్రామ సమీపం నుంచి దక్షిణం వైపుగా సుమారు 13 కిలో మీటర్ల దూరంలో దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలో సిద్దేశ్వరం క్షేత్రం ఉంది. జాతీయ రహదారి నుంచి వేంపల్లితోక వరకు తారు రోడ్డు ఉంది. అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే వర్షాలు పడితే మట్టి రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి బురదమయంగా మారుతుండడంతో క్షేత్రానికి వెళ్లేందుకు తీవ్రఅవస్థలు పడాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. ఈ మార్గం అటవీ శాఖ పరిధిలో ఉండడంతో తారురోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా మారింది.ఈ క్షేత్రం గురించిన వివరాలు వెంకటగిరి రాజుల పాలనలో దస్త్రాల్లో నమోదై ఉన్నట్టు ప్రచారం ఉంది. ఆ వివరాలు లభిస్తే రహదారి నిర్మాణానికి కొంత వెసులుబాటు కలుగుతుందని భక్తులు చెబుతున్నారు. అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించి తారురోడ్డు నిర్మాణం చేపడితే భక్తులు ఇక్కట్లు తొలగిపోతాయి.



ఘటిక సిద్దేశ్వరం క్షేత్రం

ఆ దిశగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవచూపాలని భక్తులు కోరుతున్నారు.

తిప్పలు తప్పడం లేదు

సిద్దేశ్వరం క్షేత్రం వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డుపై ప్రయాణించాలి. వర్షం పడితే మట్టి రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి బురదమయంగా మారుతుండడంతో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్డుకు మోక్షం కలగడం లేదు. పాలకులు చొరవ చూపి తారురోడ్డు నిర్మిస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.



– మురళి, భక్తుడు

తారురోడ్డు నిర్మించాలి

ప్రాచీన శైవ క్షేత్రమైన సిద్దేశ్వరానికి ఏడాది పొడవునా భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. వేంపల్లి తోక నుంచి సిద్దేశ్వరం వరకు మట్టి రోడ్డు కావడంతో భక్తులు అవస్థ పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి క్షేత్రం వరకు తారు రోడ్డు నిర్మిస్తే పర్యాటకులు, భక్తుల సంఖ్య మరింత పెరుగుతుంది.



– సిద్దయ్య, అర్చకుడు

మోక్షగుండం స్ఫూర్తి ప్రదాత



కావలి: డీబీఎస్ కళాశాలలో మోక్షగుండం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఆత్మకూరు ఇరిగేషన్ కార్యాలయంలో..

కావలి: ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని ఇంజనీరింగ్ విద్యార్థులు వృత్తిలో నైపుణ్యం సాధించి గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పిలుపునిచ్చారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్‌డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విగ్రహానికి దామిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ ఇంజనీర్ మోక్షగుండం దేశంలోని అనేక నదులపై ఆనకట్టలు, వంతెనలు నిర్మించడం ద్వారా భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా ఇనుమడింపజేశారని కొనియాడారు. మైసూర్ బృందావన ఉద్యానవనం, భద్రావతి ఇనుము, ఉక్కు కర్మాగారం నిర్మాణం, బ్యాంకు అఫ్ మైసూర్ స్థాపనలో కీలక పాత్ర పోషించారన్నారు. అటువంటి మహోన్నత ఇంజనీర్‌ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కావలి జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, పరిపాలన అధికారి జీ రమేష్‌బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్‌డే

ఆత్మకూరు: ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జలవనరుల శాఖ ఈఈ కార్యాలయంలో ఇంజనీర్స్‌డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జలవనరుల శాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మోక్షగుండం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య బ్రిటీష్ కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాత ఇంజనీర్‌గా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారన్నారు. ఆయన నిర్మించిన అనేక ప్రాజెక్ట్‌లు ఆయన సమర్థతను చాటుతున్నాయని కొనియాడారు. నేటి యువత ఆయన నిబద్ధతను, నిజాయతీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



జమ్మలపాలెంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి: ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులను ఆదేశించారు. మండలంలోని జమ్మలపాళెం సచివాలయంలో పంచాయతీ ప్రజాదర్బార్‌ను ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, సర్పంచ్ బుర్రి శ్రీవేణి, టీడీపీ మండల కన్వీనర్ పులిగుంట మధురెడ్డి, నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, నక్కా మాధవరావు, గుర్రం ప్రవీణ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్పీడుకు బ్రేకులు

అనుమసముద్రంపేట: ఆర్టీసీ స్పీడ్‌కు బ్రేకులు పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు డిపో పరిధిలోని ఆత్మకూరు–నెల్లూరు వయా ఏఎస్‌పేట, నెల్లూరు–ఏఎస్‌పేట పల్లెవెలుగు సర్వీసుల స్పీడ్‌ను వారం రోజులుగా తగ్గించారు. గతంలో పల్లెవెలుగు స్పీడ్ 60 కిలో మీటర్ల వరకు ఉండగా, ప్రస్తుతం 50 కిలోమీటర్లకు కుదించారు. గతంలో నెల్లూరు నుంచి ఏఎస్‌పేటకు 1.30 గంట సమయం పడుతుండగా , ప్రస్తుతం 2 గంటల సమయం పడుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు విధులకు ఆలస్యమవుతోందని వాపోతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతానికి గిరిజనుడి బలి

కావలి : మండలంలోని సర్వాయపాళెంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ గిరిజనుడు ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాపూరు వెంకటేశ్వర్లు (26) అనే గిరిజనుడితో లైన్‌మెన్ కరెంట్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు నరికిస్తున్నాడు. ఈ క్రమంలో కరెంట్ తీగల్లో విద్యుత్ సరఫరా జరగడంతో గిరిజనుడు షాక్ గురై మృతి చెందాడు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జలదంకి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి తీరని లోటని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు తాళ్లూరి మాల్యాద్రి అన్నారు. జలదంకిలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరి సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి మాల్యాద్రి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బలహీనవర్గాల అభ్యున్నతికి ఏచూరి ఎంతో కృషి చేశారు. ఆయన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సీపీఎం కావలి డివిజన్ నాయకుడు రావి మాల్యాద్రి, మండల కార్యదర్శి ఆంథోనీబాబు, రైతు సంఘ మండలాధ్యక్షుడు గడ్డం మాల్యాద్రిరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు అడపాల సురేష్, మాధవ, సీపీఐ మండలాధ్యక్షుడు దర్గాబాబు, ఎమ్మార్పీఎస్ నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం



సీతారామపురంలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

సీతారామపురం : స్వచ్ఛ సంకల్పం పేరుతో మండలంలోని 14 పంచాయతీల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం పట్టుకుంది. వీటిని పంచాయతీల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో నిర్మించారు. అప్పట్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని భావించారు. ఆ తరువాత వాటిని నిరుపయోగంగా వదిలేయడంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుంది. సంపద తయారీ కేంద్రాల్లో ఎక్కడా వర్మీ కంపోస్ట్ తయారు కావడం లేదు. చెత్త రిక్షాలు సైతం మూలన పడి తుప్పు పడుతున్నాయి. డంపింగ్ యార్డుల చుట్టూ ముళ్లచెట్లు దట్టంగా పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన వీటిని గాలికి వదిలేయడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథావుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేపు డీ వార్మింగ్ కార్యక్రమం

సీతారామపురం: సీతారామపురం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం డీ వార్మింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి స్వప్నరెడ్డి ఆదివారం తెలిపారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులి పురుగులతో రక్తహీనత తలెత్తుతుందన్నారు. నులి పురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 44 అంగన్‌వాడీ కేంద్రాల్లో 861, 43 పాఠశాలలు, మూడు జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాలలో 3,033, బడి బయట ఉన్న మరో 222 మంది పిల్లలతో కలిపి మొత్తం 4,116 మందిని గుర్తించామన్నారు. వారందరికీ మధ్యాహ్న భోజనం తర్వాత ఆల్బెండాజోల్ మాత్రలను అందజేయనున్నట్లు తెలిపారు.

తెలుగుపండిట్‌కు జాతీయ నంది పురస్కారం





పురస్కారాలు అందుకున్న కోడిగంపల శ్రీనివాసులు, తాటికొండ మోహన్

సంగం: సంగం మండలం దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండింట్ తాటికొండ మోహన్ జాతీయ నంది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండింట్ మోహన్‌కు తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రతినిధులు నాసా సాంబశివరావు, శాంతిబాయ్,ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు జాతీయ నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు.

కోడిగంపలకు జాతీయ పురస్కారం

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లికి చెందిన కోడిగంపల శ్రీనివాసులు జాతీయ నంది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామమూర్తి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజసేవ, అన్నమయ్య కీర్తనల ఆలాపన, సంగీత విభాగాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన శ్రీనివాసులుకు తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రతినిధులు నాసా సాంబశివరావు, శాంతిబాయ్,ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు జాతీయ నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఆత్మకూరు: ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మైక్రోసాఫ్ట్ అజూరా కమ్యూనిటీ లీడ్ ఎం పవన్‌కుమార్ అన్నారు. ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్‌రెడ్డి, 4వ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు చరణ్, వంశీ ఆధ్వర్యంలో మైక్రోసాఫ్ట్ అజూరా డెవలపర్ ప్రోగ్రాం, స్పార్కిల్ సమ్మిట్–2024ను శనివారం రాత్రి నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ అజూరా కమ్యూనిటీ లీడ్ పవన్‌కుమార్‌తో పాటు కన్సల్టెంట్ జయేష్‌కుమార్, ప్రొడక్ట్ మేనేజర్ సంజనా యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు 'కోడింగ్' తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. జాబ్ సాధించడంలో పోటీతత్వంతో పాటు స్కిల్స్‌ను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు సాంకేతిక ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కొందరు విద్యార్థుల స్కిల్స్‌ను అభినందించారు.

స్నేహ పూర్వకంగా మెలగాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై ఉమాశంకర్

కలిగిరి: గ్రామాల్లోని ప్రజలు వివాదాలకు దూరంగా ఉంటూ స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్సై ఉమాశంకర్ సూచించారు. మండలంలోని చిన్నఅన్నలూరు పంచాయతీ పరిధిలోని తొగురువారిపాళెం గ్రామస్తులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, కోడిపందేలు, తదితర జూదాలు నిర్వహించిన, ఆడిన చర్యలు తప్పవన్నారు. మద్యం అక్రమ విక్రయాలు చేపట్టరాదన్నారు. ప్రజలకు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి న్యాయం పొందవచ్చన్నారు. గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలు జరుగుతుంటే 94407 00098 నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. ఆయన వెంట ఏఎస్సై రామచంద్రయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

తుమ్మలపెంట తీరంలో ఆహ్లాదానికి చోటేదీ?



పర్యాటకులు లేక వెలవెలబోతున్న తుమ్మలపెంట తీరం

కావలి: పట్టణానికి చేరువలో తుమ్మలపెంట తీరం ఉంది. పట్టణ ప్రజలు ఎక్కువగా అక్కడికి వెళ్లి సేద తీరుతుంటారు. అయితే తీరంలో నిలువనీడ కరువవడంతో పర్యాటకులు ఉసూరుమంటున్నారు. ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితులతో ఎండలు వేసవిలో మాదిరిగా మండిపోతున్నాయి. సముద్ర తీరానికి వెళ్లి సేదదీరుదామనుకునే పట్టణ ప్రజలు ఇసుక తిన్నెల్లో నీడనిచ్చే పందిరులు, షెడ్డులు లేకపోవడంతో అక్కడికి వెళ్లే ఆలోచనను విరమించుకుంటున్నారు. అలాగే తీరంలో ఎటువంటి తినుబండారాల స్టాల్స్ సైతం లేకపోవడంతో తీరంలో సరదాగా గడపలేకపోతున్నామని పర్యాటకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తుమ్మలపెంట తీరాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

వర్షం వస్తే జాగారమే



శిథిలావస్థకు చేరిన బీసీ వసతి గృహం

- శిథిలావస్థలో సంక్షేమ వసతిగృహాలు
- శ్లాబ్‌లు దెబ్బతిని ఊడిపడుతున్న పెచ్చులు
- ఉరుస్తున్న గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



దెబ్బతిన్న ఎస్సీ బాలుర వసతి గృహం శ్లాబ్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బీసీ బాలుర వసతి గృహం, ఎస్సీ బాల, బాలికల వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. శ్లాబులు దెబ్బతిని వర్షం పడితే ఉరుస్తుండడంతో విద్యార్థులు జాగారం చేయాల్సి వస్తోంది. బీసీ కాలనీలోని బీసీ బాలుర వసతి గృహాన్ని 35 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో భవనాన్ని నాసిరకంగా నిర్మించడంతో కట్టిన కొద్ది రోజులకే దెబ్బతినగా మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కాలంలో భవనం పూర్తిగా దెబ్బతింది. శ్లాబ్ పెచ్చులు ఊడి కింద పడుతుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహం కూడా దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. 40 ఏళ్ల క్రితం నిర్మించడంతో భవనం శ్లాబ్ దెబ్బతిని పెచ్చులు ఊడి పడితున్నాయి. కిటికీలు, తలుపులు సైతం దెబ్బతిన్నాయి. దీంతో దోమల బెడదతో విద్యార్థులు అల్లాడుతున్నారు. మరుగుదొడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయి. ఎస్సీ బాలికల వసతి గృహంలో కూడా కనీస వసతులు లేవు. రాత్రి వేళల్లో విష పురుగులు గదుల్లోకి ప్రవేశిస్తుండడంతో విద్యార్థినులు హడలిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహ భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.